"ఉత్తరాలేమన్నా వచ్చాయా?"

మంచి నీళ్ళ చెంబు అందుకుంటూ అడిగాడు కాంతయ్య.

"ఆం . . పెద్దబ్బాయ్ రాశాడు." చెంబుతో పాటుగా జవాబు కూడా అందించింది భద్రమ్మ.

గబగబ ఆ నీళ్ళు కాసిని కాళ్ళ మీద పోసుకుని, కుర్చీ చేతిమీది తువాలు అందుకుని కాళ్ళు, చేతులు తుడుచుకున్నాడు కాంతయ్య. 'ఏం రాశాడు?' అని అడుగుదామని నోటి దాకా వచ్చినా, 'ఆ విషయం తెలీకుండా ఉన్నంత వరకే సుఖం, అనుకున్నట్టుగా అడగలేదు.

తువాలు భుజం మీద వేసుకుని కుర్చీలో కూర్చునే సరికల్లా భద్రమ్మ కార్డు ముక్కనీ, కాఫీ కప్పునీ అందించింది.

కాఫీ కప్పుని యాంత్రికంగానూ, కార్డు ముక్కని ఆత్రంగానూ అందుకుని, మొదటిది పక్కనే పెట్టి, రెండో దాని మీదికి దృష్టి సారించాడు. ఒక్క నిమిషంలో కార్డు చదవటం పూర్తయిపోయింది దాన్ని పక్కనే పడేశాడు.

కాంతయ్య పెద్దబ్బాయి అక్కడికి నాలుగొందల మైళ్ళ దూరంలో ఏదో వూళ్ళో పబ్లిక్ వర్క్స్‌లో గుమాస్తాగా ఉంటున్నాడు. పై రాబడి బాగానే ఉంటుందని వాళ్ళూ, వీళ్ళూ అంటుంటారు 'అలాటి వాటికి తను ఆశపడనని, గవర్నమెంటు ఇచ్చే జీతమే

## పి వి. ఆర్. శివకుమార్

తనకి ఆధారమనీ పెద్దబ్బాయి అంటుంటాడు. అందువల్ల అక్కడికి కొద్ది దూరంలోనే ఎలిమెంటరీ స్కూల్లో టీచరు గిరీ వెలగబెడుతూ ఏ పూట వచ్చు ఆ పూట కొనుక్కునే కాంతయ్యగారి రెండో అబ్బాయి లాగే అతనూ 'మొండి చేతోనే తండ్రికి జవాబు రాశాడు.

"ప్చ్ . . . అయితే వీడి మీద పెట్టుకొన్న ఆశ ఉట్టిదే నన్న మాట."

నీరసంగా అన్నాడు కాంతయ్య.

"అసలా మాట కొస్తే అతను ఎక్కడ పెట్టుకున్నాం లెండి. ఏదో బాటన్నే పీట కొన్నట్టు ఒక కార్డు ముక్క రాసి పడేశాడు కానీ, కాఫీ తీసుకోండి. చల్లారిపోతుంది" అంది భద్రమ్మ.

కప్పు అందుకుని నాలుగు గుక్కల్లో గొంతులో పోసుకుని, ఎదురుగా ఉన్న కోడు విరిగిన కుర్చీ పీట మీదికి కాళ్ళు చాపుకుని కుర్చీలోనే వెనక్కి జారగిలబడ్డాడు కాంతయ్య.

'కొడుకు పుడితే తల కొరివి మాటలా ఉంచి ప్రయోజకుడై తనని ఆదుకుంటాడని గట్టిగా నమ్ముతారు అంతా. ఆ నమ్మకంతోనే తనకి వరసగ్గా ఇద్దరూ కొడుకులే పుట్టినప్పుడు ప్రతి వాళ్ళూ అభినందించారు. తనూ ఆ నమ్మకం రేపిన ఆనందంతోనే అందరికీ స్వీట్లు కొని పంచాడు. ఏదీ—ఆ ఇద్దరు కొడుకులూ ఇవాళ తనని ఏ పాటి ఆదుకుంటున్నారు? ఉద్యోగాలు వాళ్ళ సంపాదనా, వాళ్ళ కష్టసుఖాలా వాళ్ళకే ఉంటున్నాయి. అంతకే తనని ఆదుకోలేక పోతుండవచ్చు.

కారణం ఏదయితేనేం కొడుకులు ఆదుకుంటా రన్న నమ్మకం గడ్డిదేనా.

ఏడుస్తూ నవ్వుకున్నాడు కాంతయ్య

మళ్ళీ సమస్య అతని ముందు నిలబడింది రెండో కూతురి రూపంలో.

"స్నానం చేస్తారా నాన్నా నీళ్ళు పెట్టమంటారా?" అంటూ అడిగింది ఎదురుగా నిలబడ్డ సునీత.




"పెట్టు తల్లీ" అన్నాడు కాంతయ్య కుర్చీ పీట మీంచి కాళ్ళు కిందికి దింపుతూ.

జన్మంతా పుట్టింట్లోనే గడిచి పోతుందా నీకు? కదిరి పోయిన ఈ సంబంధం అయినా చేసి లోపలికి పంపగలనా నిన్ను? అనుకున్నాడు మనసులోనే, సబ్బూ తువాలా మూలి గట్టుమీద పెట్టి వెళ్తున్న మనిషిని చూస్తూ. అంతే కళ్ళలో నీళ్ళు తిరిగి మూలి పళ్ళెంలో పడిపోయాయి.

* *

"ఇల్లు కాస్తా అతని పేర రాయించమన్నా, మా బాకీ చెల్లిస్తేగాని అప్పు ఇంకా అయ్యేవాడు నేను ఎలా ఇస్తాడు? కొత్త షావుకారు కాబట్టి వడ్డీ పైగా ఇచ్చినా ఇల్లు ఇంకా తనఖా లోనే ఉండాలి. అతనికి పూర్తిగా రాసి ఇచ్చేసినా, మిగిలే డబ్బు రాదు. పైగా ఉన్న గూడు కూడా పోతుంది. ఇప్పుడు దశలికి కడుతున్న వడ్డీ డబ్బు రేపటి నుంచీ ఇంటద్దె రూపంలో వాళ్ళకు కెవరికో కట్టాల్సి వస్తుంది. అందుచేత ఆ మాట విని, ఆ ఆలోచన మానుకోండి." సలహా ఇచ్చాడు కాంతయ్య స్నేహితుడు.

'మానుకుని మరే ఆలోచన చెయ్యాలి? అన కుంటూ ఈ రెక్కలు తప్ప మరేం ఆస్తి ఉంది? వీటిని ఎప్పుడో అమ్ముకున్నాడు ఆఫీసుకి. అమ్మకం కట్టే ఈ పాటి అన్నమైనా తినగలుగుతున్నాడు ఇంకా. ఇవి ఎన్నున్నా ఏ భరోసాతో తనకి అప్పు ఇస్తారు?

కానీ, కలసిరి వచ్చిన పెళ్ళి సవ్యంగా జరిగి పోవాలంటే ఏం చెయ్యాలి అంటున్నా కాదు. కన్నడు బిడ్డలు ఉన్నా, తల్లి తండ్రులు మంచివాళ్ళూ

దేవి పిల్సు
REGD.
వాడండి ముఖ్యంగా అలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టుకు
SEALED PACKING 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO., MADRAS-21




సులభ వాయిదాల పొదుపు పథకంలో చేరండి!
లక్షల విలువయిన బహుమతులు పొందండి!!
జయప్రద ఫైనాన్స్ సిండికేట్
మెయిన్‌రోడ్, రాజమండ్రి-1

కనక మూడు వేల రూపాయల్లోనే కట్నంగా, లాంఛనాలూ అన్నీ సరిపెట్టుకుంటా మన్నారు. ఎంత క్లుప్తంగా ముగించినా మరో రెండు వేలు నా లేనిదే పెళ్ళి ఖర్చులు వెళ్ళవు.

మరిప్పుడా అందుకు వేరా ఎలా? ఎలా?'

"అయ్యగారు పిలుస్తున్నారండీ" అటెండరొచ్చి కాంతయ్య ఆలోచనల గొలుసుని కత్తిరించాడు.

"వస్తున్నా" అంటూ లేచి అయ్యగారి గది వైపు నడిచాడు కాంతయ్య. ఆయనగారు అర్జెంటుగా వెళ్ళవలసిన కాంట్రాక్టుల గురించి ఇచ్చిన తొందరా, చేసిన హెచ్చరికలూ చెవిన వేసుకుని వచ్చి సీట్లో కూర్చున్నాడు. ఆలోచనల్ని అవతలికి నెట్టి ఆ అర్జెంటు ఫైళ్ళతో కుస్తీ పట్టటం ప్రారంభించాడు.

* * *

"ఇవాళైనా పురోహితుడిని కలిశారండీ?"

ఆ రాత్రి భోజనం చేస్తున్న కాంతయ్యని భద్రమ్మ ప్రశ్న ఇరిటేట్ చేసింది అకారణంగా.

"అంటే ఆ పాటి బాధ్యత తెలియని వెధవ ననుకుంటున్నావా?" అంటూ అరిచాడు.

తెల్లబోయింది భద్రమ్మ.

'తనేం అన్నదని అంత కోపం?'

"పురోహితుణ్ణి కలవగానే ముహూర్తాలు పెట్టించగానే పెళ్ళి అయిపోదు. డబ్బు... డబ్బు ఉండాలి. ముందు. అది ఉంటే ఏం లేకపోయినా ఫరవాలేదు." సమర్థించుకుంటూ అన్నాడు కాంతయ్య మళ్ళీ.

భద్రమ్మ ఏం జవాబు చెప్పలేదు.

"సరే, నీమీదా కోపం వచ్చిందన్నమాట. నువ్వా పన్నే సాధించు. అంతకన్న ఏం చెయ్యగలరు ఎవరైనా."

"సాధించటం కూడానా. అయ్యో రామ! వియ్యంకుడుగారు ముహూర్తాలు పెట్టించమని ఉత్తరం రాసి నాలుగు రోజులు దాటి పోతూంది కదా అని ఒక మాట గుర్తు చేస్తేనే అంత కోపం వచ్చె మీకు. ఇహ సాధిస్తేనా. . ."

"నువ్వు గుర్తు చేసేందుకు కాదే నా కోపం— నా చేతకానితనం మీదే. వైశాఖం అంటే ఇంకా రెండు నెలలైనా లేదు. ఇంతలోపుగా డబ్బు ఎలా కూడుతుందో అర్థం కావటం లేదు. . ."

"ఆ దేవుడి మీదే భారం వేసి పని ప్రారంభించండి. చివరికి ఏ దారీ లేకపోతే నా ఆత్మాభిమానాన్ని గాలికి వదిలేసి, మా అన్నయ్య దగ్గరకే వెళ్ళి అడుగుతాను." భద్రమ్మ గొంతు వణుకుతూండగా అంది.

"మీ అన్నయ్య దగ్గరకా?" విస్తుపోయాడు కాంతయ్య.

"పోనివ్వండి. పరువు బజారులో వేసుకునే కన్న అన్నయ్య దగ్గర పోగొట్టుకోవటం ఎక్కువ కాదుగా."

భద్రమ్మ పట్టుదల తెలిసిన కాంతయ్య ఆ మాటలకి విస్మయపడ్డాడు. చెడు తిరుగుళ్ళు తిరిగి కాలు జారిన తన కూతుర్ని కోడలిగా చేసుకోమని అడిగి వచ్చిన అన్నయ్యని కాదంది అయిదేళ్ళ క్రితం భద్రమ్మ.

"కాదనటం తేలికే. కానీ, నా కూతుర్ని కాదనటం దానితోపాటుగా వచ్చే లక్ష రూపాయల ఆస్తినీ కాదనుకోవటమే. ఆలోచించుకో" అన్న తోబుట్టువు మాటలకి "డబ్బు కోసం అవినీతిని ప్రోత్సహించ లేను, అన్నయ్యా. నా కూతురు బుద్ధి గడ్డితిని ఇలా చేసింది. నువ్వే కడుపులో పెట్టుకోమని అడిగితే నా జవాబు ఎలా ఉండేదో కానీ, డబ్బు ఎర వేసి నన్ను ఆకట్టుకోవా లనుకున్నావు. ఇది చాలా అసహ్యకరమైన విషయం. నన్ను క్షమించి మరోసారి అలా మాట్లాడకు, వెళ్ళిపో" అంది భద్రమ్మ.

"నా కూతురి తప్పుని కాయమని నిన్ను నేను ప్రార్థించాలా? అంత ఖర్మ నాకు లేదు. డబ్బు పారేస్తే కుక్కల్లా వస్తారు పెళ్ళి కొడుకులు. ఏదో తోడ బుట్టిన దానివి, ఆ ఛాన్సు నా మేనల్లుడికే ఇస్తే, సంతోషిస్తావని వస్తే, పెద్ద గొప్పలు పోతున్నావ్. ఇవాళ కాళ్ళ దగ్గరకు వచ్చిన డబ్బు కాదనుకుంటే రేపు ఆ డబ్బుకే మొహం వాచి, అడుక్కు తింటావ్, జాగ్రత్త." రౌద్రంగా అన్నాడతను.

"నీ దీవెన వల్ల అలాంటి రోజంటూ వచ్చినా, నీ ముందు మాత్రం చెయ్యి జాపనులే" అంది భద్రమ్మ.

అలాంటిది ఇవాళ ఆమె అన్నయ్య పేరెత్తిందంటే, కూతురి పెళ్ళి గురించి ఆమె ఎంత తపించి పోతూందో అర్థమయింది కాంతయ్యకి.

"నా బొందిలో ప్రాణం ఉండగా నీకు మీ అన్నయ్య ముందు చెయ్యి జాపే అవసరం రాదులే" అన్నాడు ఆమెని సానుభూతిగా చూస్తూ.

* * *

ఆ రోజు పోస్టులో మరో ఉత్తరం వచ్చింది కాంతయ్యకి.

"సుమారు వారం రోజుల క్రితం ఒక ఉత్తరం రాశాను. ముహూర్తం విషయంలో మీ నుంచి ఇంకా జవాబు రాలేదు. ఏ మాటాకూడా రాయలేదు మీరు. బహుశః ఆ ఉత్తరం ఏ కారణాల వల్లనైనా అందలేదేమో నని మళ్ళీ రాస్తున్నాను— ఈ సారి ఆఫీసు అడ్రసుకి.

అబ్బాయికి ఆఫీసులో ఏదో క్యాంపు పడేటట్లు ఉంది. ముహూర్తం నిర్ణయించుకుంటే క్యాంపుని అందుకు వీలుగా దిద్దుకుంటాడు. క్యాంపు రెండు నెలల పాటు ఉంటుంది. కనక ఈ ఉత్తరం అందిన వెంటనే జవాబు రాయించగలరు" అంటూ రాశాడు కాబోయే వియ్యంకుడు.

'ఇహ తను తాత్సారం చేస్తే వ్యవహారమే బెడిసి కొట్టే ప్రమాద ముంది. ఏదో ఒకటి ఆలోచించాలి.' గట్టిగా అనుకుని, ఆలోచనల్లో పడ్డాడు కాంతయ్య. ఎంతగా ఆలోచించినా డబ్బు పుట్టే మార్గం ఏదీ కనపడ్లేదు. చివరికి మళ్ళీ షావుకారు గారే గుర్తుకి వచ్చాడు. 'ఆయన చేతులూ, కాళ్ళూ పుచ్చుకుని ఈ అవసరం గడపమని ప్రార్థించాలి. ఆ వెనక చేతులూ, కాళ్ళూ విరుచుకునయినా డబ్బు సంపాదించి, ఆ అప్పు తీర్చుకోవచ్చు' అనుకున్నాడు. అనుకున్నాడే తప్ప, చేతులూ కాళ్ళూ విరుచుకుని ఏం పనిచేసి డబ్బు సంపాదించగలడో అతనికే తెలియదు. అయినా, ప్రస్తుతానికి ఆ ఆలోచన వాయిదా వేసి, షావుకార్ని ఎలా కన్విన్స్ చేయాలా అనే ఆలోచించసాగాడు.

■ ● ■

ఆ సాయంత్రం ఆఫీసు నించి నరాసరి షావుకారు గారింటికి బయలుదేరాడు కాంతయ్య. షావుకారు ఇంట్లో లేడు; షాపులో లేడు. బిజినెస్ పనిమీద బయటికి వెళ్ళాడట. మరో గంటలో వస్తా డన్నారు వాళ్ళు.

నిరుత్సాహంగా రోడ్డు మీదికివచ్చాడు కాంతయ్య. హోటల్లోకి వెళ్ళి కూర్చున్నాడు. మెనూ అంతా విని, కాఫీ మాత్రం ఆర్డ రిచ్చాడు. కాఫీ తాగి, రోడ్డు మీద పడ్డాడు మళ్ళా.

రద్దీగా ఉంది సెంటర్. రోడ్డుకి రెండు వైపులా వరసాగ్గా షాపులు. ప్రతి షాపులోనూ పాతిక, ముప్ఫై మంది పైగా జనం. . . కనపడ్డ దల్లా కొనేయాలని ప్రతి వారిలోనూ ఆత్రత.

'ఒకడు పదేసి రూపాయల చొప్పున పారేసినా తన గండం ( కూతురి పెళ్ళిని ఆ క్షణంలో గండం అనుకున్నందుకు అతనికి సిగ్గు అనిపించనే లేదు ) గట్టెక్కుతుంది. వేలు ఖరీదు చేసే సామాన్లు,ఫర్నిచరూ, బట్టలూ నిమిషాల మీద అమ్ముడవుతున్నాయి ఆ షాపుల్లో. వందల కొద్దీ డబ్బు ఖర్చు చేసి వాటిని కొంటున్న వాళ్ళు పది రూపాయలు తనకి పారెయ్య లేరా?' అనిపించింది కాసేపు కాంతయ్యకి.

అంతలోనే సిగ్గుతో చితికిపోయాడతను. 'చివరికి తన ఆలోచనలు బిచ్చం ఎత్తుకునే స్థాయికి దిగజారాయన్న మాట.'

అంతలో అతనికి అవతలి పేవ్‌మెంట్ మీద మెరుపు మెరిసినట్టయింది. ఆ మెరుపు తాలూకు రూపం షావుకారుగారు.

'అరే, ఆయన వచ్చేస్తున్నాడు. పనయిపోయి తిరిగొచ్చేస్తున్నట్టున్నాడు. మరో పదడుగులు వేశా డంటే షాపులోకిపోయి పడతాడు. షాపులో కూర్చున్నా డంటే తను ఆయనతో మాట్లాడటానికి కనీసం గంటసేపైనా పడుతుంది.

'ఆఁ పంతులూ అయిదు నిమిషాలు అంటూనే గంటలు కూర్చో పెట్టేసి, తన పని చక్క బెట్టేసుకుంటాడు. రోడ్డు మీదే కలిస్తే కాస్త హోటల్లోకి లాక్కొచ్చి కాఫీ పోయిస్తూ తన గోడు వినిపించుకో వచ్చు."

ఈ ఆలోచన కలిగిన మరు క్షణం కాంతయ్య చటుక్కున పేవ్‌మెంట్ దిగాడు. అర్జునుడికి పక్షి గుడ్డు తప్ప మరేం కనిపించనట్టు, అతనికి షావుకారు తప్ప ఇంకెవ్వరూ కనిపించటంలేదు. గబగబ రోడ్డు దాటి ఆయన్ని కలుసుకుందామని వేగంగా నడిచాడు.

ఫర్ర్‌ర్. . . క్రీచ్. . . క్రీచ్. . .

స్కూటర్ చప్పుడు,,, లారీ చప్పుడు... బ్రేకుల చప్పుడు. . . ఒక్కసారి ఆగాయి స్కూటరూ, లారీ. . . కానీ అనర్థమే జరిగిపోయింది.

కాంతయ్యని పడదోసి కానీ ఆగలేదు స్కూటర్. లారీని తప్పించబోయే తొందరలో స్కూటర్ కిందికి వెళ్తున్న సంగతి గమనించ లేకపోయాడు కాంతయ్య. ఫలితమే ఆ ప్రమాదం.

మరు నిమిషంలో చుట్టు పక్కల జనమంతా అక్కడ మూగారు.

"అరే, కాంతయ్య పంతులుగారు. . ."అన్నాడు ఆయన్ని గుర్తించిన షావుకారు. అతనే ఒక రిక్షా కూడా పిలిచి కాంతయ్యని హాస్పిటల్‌కి చేర్చాడు. డబ్బున్న షావుకారుగారు తీసుకువచ్చిన కేసు కనక డాక్టరు త్వరగా చేపట్టాడు. షావుకారు అక్కడున్న ఒక కుర్రాడిని కాంతయ్య గారింటికి పరిగెత్తించాడు. భద్రమ్మగారూ, సునీత క్షణాల మీద హాస్పిటల్ చేరుకున్నారు. అప్పటికే కాంతయ్యని ఆపరేషన్ థియేటర్లోకి తీసుకు వెళ్ళటం జరిగింది.

దేవుడికి దణ్ణాలు పెట్టుకుంటూ కూర్చున్నా రిద్దరూ ఆపరేషన్ థియేటర్ ముందు.

"ఏడవబోకండమ్మా, మరేం ప్రమాదం లేద న్నాడు డాక్టర్‌గారు. . ." అంటూ ధైర్యం చెప్ప సాగాడు షావుకారు.

సుమారు గంట సేపటి తరవాత బయటకు వచ్చాడు డాక్టర్.

"ఎలా ఉంది డాక్టర్‌గారూ?" అంటూ ప్రశ్నించాడు షావుకారు. భద్రమ్మ, సునీతలుకూడా అదే ప్రశ్నార్థకంతో ఆయన వైపు చూస్తూ నిల బడ్డారు.

"ప్రాణాని కేం భయం లేదు" అన్నాడు డాక్టరు. "కాని. . ."

"ఏమిటి సార్, కానీ ఏమిటి?" కంగారుగా ముందడుగు వేసి అడిగింది సునీత.

"ఏం లేదమ్మా. ఆక్సిడెంట్‌లో ఆయన కుడి కాలు పూర్తిగా చితికి పోయింది. స్కూటర్ కాలి మీంచే పోయినట్టుంది. ఆ కాలు తీసి వేయాల్సి వచ్చింది మోకాలి దాకా" చెప్పాడు డాక్టర్.

"ఆఁ. . ." నిర్విణ్ణు లయ్యారు ఆ మాటలు విన్న శ్రోతలు.

"అంటే. . . కాంతయ్య పంతులు కింక 'కుంటి బతుకు' తప్పదా?" నోరు తెరిచేసి భయంగా అన్నాడు షావుకారు.

"అయ్యో! ఇంత అన్యాయం ఎందుకు చేశావు, భగవంతుడా" అంటూ తల మొత్తుకో సాగింది భద్రమ్మ.

సునీత కళ్ళలోంచి నీళ్ళు నిశ్శబ్దంగా పొరు తున్నాయి.

* * *

మరునాడు కాంతయ్యని చూడటానికి ఆఫీసు స్టాఫంతా వచ్చారు. అరగంట సేపు కూర్చుని ఓదార్పు మాటలు మాట్లాడారు. అంతా తిరిగి వెళ్ళిపోతుండగా కాంతయ్య ప్రాణ మిత్రుడు అతనికి మరింత దగ్గరగా స్టూలు లాక్కుని కూర్చుని అన్నాడు:

"ఇలాటప్పుడు ఇలా మాట్లాడుతున్నా నని మరోలా భావించకు. అవసరం కనక చెప్తున్నాను . . ."

"ఏమిట్రా అంత మొగమాటం?. . . చెప్పు" అన్నాడు కాంతయ్య నీరసంగా.

"ఏం లేదు. ఆక్సిడెంట్లో కాలు పోయింది కదా. ఆ మధ్య మనం ఆక్సిడెంట్ పాలసీలు కట్టాం—గుర్తుందిగా. . ."

సడెన్‌గా గుర్తొచ్చింది కాంతయ్యకి—దాదాపు ఏడు నెలల క్రితం తనూ పన్నెండ్రూపాయలు పెట్టి ఆ పాలసీ తీసుకున్న విషయం.

"అవును, ఆ పాలసీ కింద నా కిప్పుడు ఆరు వేల డబ్బు వస్తుంది కాబోలు" అన్నాడు చటుక్కున.

అతనికి కాలు పోయినందుకు ఏడవాలో, డబ్బొస్తున్నందుకు సంతోషించాలో అర్థం కాలేదు.

మిత్రుడు తను తెచ్చిన ఫారాలు నింపి, "డాక్టర్‌గారిచేత సర్టిఫికెట్ రాయించి ఉంచు. వీటి మీద సంతకాలు చేసి ఉంచితే, అన్నీ రేపు వచ్చి తీసుకు వెళ్ళి ఆ ఇన్స్యూరెన్స్ ఆఫీసులో ఇస్తాను" అన్నాడు.

"థాంక్స్ బ్రదర్" అన్నాడు కాంతయ్య నీళ్ళు నిండిన కళ్ళతో అతడిని చూస్తూ.

* * *

శ్రావణ మాసంలో సునీత పెళ్ళి జరిగిపోయింది. కాంతయ్య (కొయ్య) కాలు, చెయ్యి కూడదీసుకునే సరికి ఆమాత్రం ఆలస్యం జరక్క తప్పలేదు.

పెళ్ళి పందిట్లో నిలబడి కూతుర్ని అంపకం పెడుతున్న కాంతయ్యకి 'కాలూ, చెయ్యీ విరుచుకు నయినా షావుకారు అప్పు తీర్చాలని' ఆర్నెల్ల నాడు తను అనుకున్న మాటలు గుర్తొచ్చాయి.

కుంటి కాలి కేసి దీనంగా చూసుకున్నాడు కాంతయ్య—'సంపాదనకి వెయ్యి మార్గా లుంటా యంటారు పెద్దలు. ఈ ఆధునిక యుగంలో ఇది వెయ్యిన్నొకటో మార్గం కాబోలు' అనుకుంటూ.

*

